ప్రజాశక్తి
గురువారం 23 నవంబర్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

బిజెపి హయాంలో పెరిగిన దాడులు



సదస్సులో అభివాదం చేస్తున్న వి.శ్రీనివాసరావు, బి.వెంకట్ తదితరులు

- ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే దళిత, గిరిజన హక్కులకు రక్షణ
- 'రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం కోసం' రాష్ట్ర సదస్సులో వక్తల ఉద్ఘాటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

బిజెపి హయాంలో దేశంలో సామాజిక తరగతులపై దాడులు పెరిగాయని పలువురు వక్తలు అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటేనే దళిత, గిరిజనుల హక్కులకు రక్షణ ఉంటుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఉద్ఘాటించారు. నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఉదయం 'రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం కోసం' రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్, ఎఐఎడబ్ల్యుయు, ఎఐఆర్ఎల్ఎ, డిబిఎస్‌యు, డిబిఎఫ్, పిఎంసి వంటి సామాజిక, ప్రజాసంఘాల రాష్ట్ర కమిటీలు ఈ సదస్సు నిర్వహించాయి. ముఖ్య వక్తగా హాజరైన దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దళిత, గిరిజన హక్కులను కాలరాసే శాసనాలు మోడీ ప్రభుత్వ హయాంలో రూపుదిద్దుకున్నాయన్నారు. అలాంటి చట్టాలకు ఆమోద ముద్ర వేస్తూ దళితుల మనోభావాలను అణచడం, అంబేద్కర్ ఫొటో పెట్టి కీర్తించడం రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డికి అలవాటైందని అన్నారు. ఇటీవల జరిగిన క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌కు మోడీ, షాలు రాజకీయ రంగు పులిమారన్నారు. సిడిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత 100కు పైగా దళిత, గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల సమన్వయంతో ఏర్పడ్డ ఈ సదస్సు చారిత్రాత్మకంగా నిలువనుందన్నారు. ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారంలో ఇతరుల సాయం తీసుకోవాలన్నారు. 2024 ఎన్నికల్లో దళితుల సమస్యలు అజెండా కావాలని ఆకాంక్షించారు. దేశంలో ఆధిపత్య కులాలే అన్ని విషయాలను అన్నిచోట్లా నియంత్రిస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా దళితులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ.రామ్మూర్తి మాట్లాడుతూ అందరి లక్ష్యం దేశంలో మిగతా 2లో..



తీవ్రంగా గాయపడ్డ బేతని స్కూలు విద్యార్థి



నగరంపాలెం వద్ద గాయపడ్డ చిన్నారి

అయ్యో.. పిల్లలు

- విశాఖలో వేర్వేరు చోట్ల ప్రమాదాలు
- 15 మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - సీతమ్మధార, మధురవాడ, ఎంవిపి.కాలనీ

విశాఖలో బుధవారం ఉదయం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో 15 మంది పాఠశాల విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనల్లో ఇద్దరు ఆటో డ్రైవర్లూ గాయపడ్డారు. ఆటోల్లో విద్యార్థులు స్కూళ్లకు వెళ్తున్న క్రమంలోనే ఈ ప్రమాదాలు సంభవించాయి. ఒకేసారి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇలా ప్రమాదాలకు గురవడం పలువురిని కలిచివేసింది. నగరంలోని సంగం - శరత్ థియేటర్ వద్ద లారీ, మిగతా 2లో..



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

వార్త 3లో..

బ్లాక్ టికెట్లు విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

వార్త 2లో..

ఓట్లు తొలగిస్తే చర్యలు తీవ్రం : ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

వార్త 3లో..



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ చంద్రకళ

విశాఖ బాలోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో జరగనున్న విశాఖ బాలోత్సవ్ పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ ఆవిష్కరించారు. బుధవారం బాలోత్సవ్ అధ్యక్షులు పిల్లలమర్రి రఘు, ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.రమాదేవి, దండు నాగేశ్వర రావు తదితరులు బాలోత్సవ్ వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళను కలిసి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. సెయింట్ ఆంథోనీ స్కూల్‌తో ఈ మెగా చిల్డ్రన్ ఫెస్టివల్ జరుగనుందని వివరించారు. బాలోత్సవ్‌లో అన్ని స్కూళ్ల విద్యార్థులూ పాల్గొనేలా హెడ్మాస్టర్లను సూచిస్తే బాగుంటుందని కోరగా అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.

నేడే నగరంలో క్రికెట్ సంబరం

- భారత్ - ఆసీస్ మధ్య తొలి టి 20 మ్యాచ్
- స్టేడియం సమీప ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు



మ్యాచ్‌కు సిద్ధమైన పిఎం.పాలెంలోని క్రికెట్ స్టేడియం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖ.. క్రికెట్ క్రీడా సంబరానికి సిద్ధమైంది. ఇండియా - ఆస్ట్రేలియా జట్ల మధ్య నగరంలోని వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో గురువారం జరుగనున్న తొలి టి - 20 మ్యాచ్‌కు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా సుమారు 1500 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు అమర్చారు. షీ టీమ్స్, మఫ్టీ, ట్రాఫిక్ పోలీసులతో పటిష్టమైన నిఘా పెట్టారు. బైకులు, కార్ల పార్కింగ్‌కు వేర్వేరు ప్రాంతాలను కేటాయించారు. ఎసిఎ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్టేడియంలో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. నగరానికి చేరుకున్న ఇరు జట్లుకూ ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని, ఆస్ట్రేలియాతో ఆడిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఓడిన తరువాత నాలుగు రోజుల్లోనే ఈ టి - 20 సిరీస్ ప్రారంభమవుతోందని ఆయన అన్నారు. ఈ మ్యాచ్ ఫ్యాన్స్‌లో సరికొత్త ఉత్సాహం నింపుతుందని తెలిపారు. మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమవుతుండగా.. సాయంత్రం 5 గంటల నుంచి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామన్నారు.

విజయంపై భారత్ గురి

ఈ స్టేడియం భారత్ జట్టుకు అచ్చొచ్చిన మైదానం. కానీ ఇదే ఏడాది మార్చిలో జరిగిన భారత్, ఆసీస్ వన్డే మ్యాచ్‌లో టీమిండియా ఓటమి పాలైంది. అంతేగాకుండా ఇటీవల జరిగిన వరల్డ్ కప్ ఫైనల్‌లో కూడా భారత్ ఆసీస్ చేతిలో ఓటమి చవిచూసింది. వీటిని దృష్టిలో పెట్టుకుని టీమిండియా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బిజెపి హయాంలో పెరిగిన దాడులు

2024 ఎన్నికల్లో బిజెపి ఓటమేనన్నారు. దేశంలో 25 శాతంగల దళితులు రానున్న రోజుల్లో బిజెపి వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని కోరారు. డిబిఎస్‌యు వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ మాట్లాడుతూ దళితులపై దాడులు, హత్యలు జరిగితే యాంటిసిపేటరీ కూడా వర్తించదని, అలాంటిది బిజెపి పాలనలో స్టేషన్ బెయిల్లు కూడా ఇచ్చేయడం దారుణమని అన్నారు. ఎపిలో రాజకీయ పార్టీలన్నీ బిజెపికి వంత పాడుతున్నాయని తెలిపారు. డిబిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి.చిట్టిబాబు మాట్లాడుతూ చట్టాలున్నా ఎపిలో క్రైం రేటు పెరిగిపోతోందని ఆందోళన చెందారు. బికెఎంయు జాతీయ ఉపాధ్యక్షులు ఆవుల శేఖర్ మాట్లాడుతూ నేటికీ దేశంలో అనేక గ్రామాల్లో ఎక్కడో దూరంగా, వేరుగా దళితులకు ఇల్లు ఇస్తున్నారని, ఏపిలోనూ అది కనిపిస్తోందని అన్నారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఆర్‌పిఐ (ఎ) జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డ కళ్యాణరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకరరావు, సిఐటియు నాయకులు ఎం.జగ్గునాయుడు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, డిఎస్‌ఎంఎం జాతీయ నాయకురాలు భాగం లక్ష్మి, కెవిపిఎస్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, నాయకులు టి.చిరంజీవి, ముద్దాడ వరప్రసాద్, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడాల రాంబాబు, ఐడిజెఎస్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు తంగేటి నానాజీ పాల్గొన్నారు.

నేడే నగరంలో క్రికెట్ సంబరం

క్రీడాకారులు విజయంపై గురిపెట్టారు.

ట్రాఫిక్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి

ఇప్పటికే ప్రత్యామ్నాయ రోడ్ల మార్గాలను అధికారులు సూచించారు. మ్యాచ్‌తో సంబంధం లేని వాహనదారులు మధురవాడ క్రికెట్ స్టేడియం వైపు ప్రయాణించకుండా వేరే మార్గాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ టి – 20 మ్యాచ్‌కు ప్రేక్షకుల తాకిడి ఎక్కువగానే ఉండనుంది. ఈ నేపథ్యంలో ఎటువంటి అపశృతులూ దొర్లకుండా స్టేడియం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియంలోని అన్ని గేట్ల వద్దా ఎసిపి స్థాయి అధికారులను నియమించారు. అంతర్జాతీయ మ్యాచ్ కావడంతో మూడంచెల భద్రతను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సుమారు రెండు వేల మంది అధికారులు, సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లలో ఉన్నారు. ఏడు గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చే ప్రేక్షకులు సరైన టికెట్లు లేదా ఎంట్రీ పాస్ కలిగి ఉండాలని, నిర్దేశించిన గేట్ల ద్వారా రెండు గంటల ముందుగా స్టేడియంలోకి ప్రవేశించాలని పోలీసు అధికారులు తెలిపారు.

అయ్యో.. పిల్లలు

ఆటో ఢీకొన్న ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది.

సంగం – శరత్ థియేటర్ పక్కన ఖజానా జ్యూయలరీ ఎదురుగా ఆటోడ్రైవర్ వేగంగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. వారికి నగరంలోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పలువురు వైసిపి, టిడిపి నాయకులు పరామర్శించారు. అలాగే జివిఎంసి ఏడో వార్డు పరిధిలోని మధురవాడ నగరంపాలెం రోడ్డులో పంది అడ్డు రావడంతో పిల్లలను పాఠశాలలకు తీసుకు వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ప్రమాద సమయంలో ఆటోలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఏడుగురు పిల్లలు ఉన్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి.

సిపిఎం జిల్లా కమిటీ దిగ్భ్రాంతి

విద్యార్థులు ప్రమాదానికి గురైన ఘటనపై సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఓ ప్రకటన విడుదల చేశారు. క్షతగాత్రుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. గాయపడ్డ వారికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో వైద్య సదుపాయం అందించాలన్నారు. ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు నేడు పరిహారం అందజేత

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ఫిషింగ్ హార్బర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో 30 బోట్లు పూర్తిగానూ, 18 బోట్లు పాక్షికంగానూ దగ్ధమైన ఘటనలో వాటికి గురువారం 80 శాతం పరిహారాన్ని అందించనున్నట్టు జిల్లా అధికారులు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ ఘటనతో జీవనోపాధి కోల్పోయిన హమాలీలు, చిరు వ్యాపారస్తులను ఆదుకొనే ఉద్దేశంతో వారికి 10 వేల రూపాయల సహాయాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు, టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అందజేస్తారని వెల్లడించారు.

అందరికీ సమన్యాయం

ప్రజాశక్తి – కలెక్టరేట్ : రాష్ట్రంలో 119 కులాలు ఉండగా అన్ని కులాల వారికీ న్యాయం చేసి నేడు సామాజిక సాధికారిక యాత్రకు శ్రీకారం చుట్టిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం దక్షిణ నియోజకవర్గంలో సాగింది. డైమండ్ పార్క్ జంక్షన్ వద్ద నుంచి బస్సు యాత్ర జగదాంబ మీదుగా పాత పోస్ట్ ఆఫీస్ వరకు సాగింది. అనంతరం పోర్టు సమీపంలోని సీ హార్స్ జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి నిర్వచనం జగన్ అన్నారు. చంద్రబాబుపై పలు విమర్శలు చేశారు. రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలు కోరుకుంటున్న విధంగా విశాఖకు రాజధాని రాబోతుందని తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, తదితరులు మాట్లాడారు.

అగ్ని ప్రమాద బాధితులకు సిపిఎం నేతల పరామర్శ



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో బోట్లు కాలిపోయి తీవ్రంగా నష్టపోయిన బాధితులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు పరామర్శించారు. ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతంలో బుధవారం ఉదయం సిపిఎం నాయకులు పర్యటించారు. అక్కడున్న వారిని ఘటన ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బోట్లు కాలిపోయిన యజమానులకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని, బోట్లపై ఆధారపడి జీవిస్తున్న కలాసీలకు, చిరువ్యాపారులకు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హార్బర్ ఏరియాలో మెరైన్ పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. ఆకతాయిగాళ్ళు, గంజాయి, మందు తాగేవాళ్ళు బోటు యజమానులకు సంబంధం లేకుండా బోట్లలో ఉంటున్నట్లు మత్స్యకారులు తెలిపారని అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే అసలైన నేరస్తుడిని వదిలి ఫిర్యాదుదారుడిని పట్టుకొని విచారించడం సరైంది కాదన్నారు. జెట్టీ విస్తరణకు ప్రభుత్వం 152 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్టు ప్రకటనలకే పరిమితం కాకుండా పనులు ప్రారంభించాలన్నారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీని పెంచాల్సింది పోయి రూ.9 నుంచి రూ.7.50కి తగ్గించేయడం దారుణమన్నారు. ఇప్పటి వరకూ బకాయి పడ్డ డీజిల్ సబ్సిడీ, వేట నిషేధ కాలానికి రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, జోన్ నాయకులు కెవిపి.చంద్రమౌళి, కె.నర్సింగరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల జిఒలో సవరణలు చేయాలి

ప్రజాశక్తి – కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ విడుదల చేసిన జిఒను సవరించాలని కోరుతూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు విశాఖ అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జిఒ 535లో ఉన్న కొన్ని నిబంధనలు కారణంగా అత్యధిక శాతం మంది జర్నలిస్టులు ఎటువంటి లబ్ధి పొందలేరని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఆయనను కలిసిన సొసైటీ ప్రతినిధులు జిఒలో ఉన్న కొన్ని నిబంధనలను సడలించాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి రీత్యా 60 : 40 ప్రాతిపదికన రూపొందించిన నిబంధనను అందరికీ అనువుగా ఉండేలా 90:10 నిష్పత్తిలో చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భార్య పేరున గానీ భర్త పేరున గానీ ఇళ్ల స్థలం, ఫ్లాట్, ఇల్లు ఉంటే అనర్హులని ప్రకటించడం వల్ల 80 శాతానికి పైగా జర్నలిస్టులు నష్టపోతారని వివరించారు. ఆ నిబంధనను తొలగించేలా కృషి చేయాలని కోరారు.

2023లో అక్రిడేషన్ లేని జర్నలిస్టులకు గతంలో వున్న అక్రిడేషన్ల సీనియార్టీ ప్రాతిపదికన ఇళ్ల స్థలాల కేటాయింపునకు అర్హులుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు జి.జనార్దన్ రావు, అధ్యక్షులు బి.రవికాంత్, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎం.చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొప్పన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ టికెట్లు విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : గురువారం పి.ఎం.పాలెంలోని ఎసిఎ – విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఇండియా – ఆస్ట్రేలియా టి 20 మ్యాచ్‌కు సంబంధించి బ్లాక్ మార్కెట్‌లో టికెట్లు విక్రయిస్తున్న నలుగురు సభ్యులతో కూడిన ముఠాను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎసిపి త్రినాధుడు ఆధ్వర్యంలోని బృందం పలు ప్రాంతాల్లో నిఘా పెట్టగా వీరు దొరికారు. వారి నుంచి 51 టిక్కెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా డాక్టర్ సుజిత్ ఆటిజం ఫౌండేషన్ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ సుజిత్ తదితరులు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : హీలియోస్ హోమియోపతి క్లినిక్, డాక్టర్ సుజిత్ ఆటిజం ఫౌండేషన్ ఐదో వార్షికోత్సవం గురువారం సాయంత్రం ద్వారకానగర్ ఐటిసి ఫార్చ్యూన్ ఎదురుగా ఉన్న వారి కార్యాలయంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా బిఎస్ఎ వైజాగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవిటి.రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థాపించిన తక్కువ కాలంలోనే వెయ్యికిపైగా ఆటిజం కేసులను విజయవంతంగా పూర్తి చేయటం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఈ వ్యాధిని నివారించేందుకు తమ వంతు సాయం అందిస్తామని అన్నారు. హీలియోస్ హోమియోపతి క్లినిక్, డాక్టర్ సుజిత్ ఆటిజం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుజిత్ ఆటిజం నివారణకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం డాక్టర్ సుజిత్ మాట్లాడుతూ ఆటిజం నిర్మూలనకు తాము అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. విశాఖపట్నంతో పాటు ముంబయి, హైదరాబాద్‌లలో తమకు శాఖలు ఉన్నాయని, ఉత్తమమైన వైద్య సేవలు తమ ప్రధాన లక్ష్యమని అన్నారు.

1న విభిన్న ప్రతిభావంతుల టాలెంట్ షో

ప్రజాశక్తి – కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 1న లయన్స్ క్లబ్ విశాఖపట్నం, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా రామ్ నగర్ లయన్స్ క్లబ్‌లో విభిన్న ప్రతిభావంతులకు టాలెంట్ షో నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ ప్రతినిధి డి.ప్రసాద్ రాజు, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ కె.సుశీల ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. జిల్లాలో వీరి కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సంస్థలు పిల్లలను ప్రోత్సహించి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విభిన్న ప్రతిభావంతుల నైపుణ్యాలను గుర్తించి, వారి ఆసక్తికి తగ్గట్టుగా ప్రోత్సహించి, తర్ఫీదునిచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలని తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 18 సంవత్సరాలలోపు వయసు వరకు పిల్లలు పాల్గొనవచ్చునన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్, అదే విధంగా గెలిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు 9392632790, 7893495537 నెంబర్లను సంప్రదించాలన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



ఫుట్ బాల్ పోటీలో తలపడుతున్న నెల్లూరు, వెస్ట్ గోదావరి జట్లు

ప్రజాశక్తి-భీమునిపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న 67వ అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 14 ఏళ్లలోపు బాలురు, బాలికలకు ఈ పోటీలు జరుగుతుండగా, 13 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

బాలికల విభాగంలో ప్రకాశం, ఈస్ట్ గోదావరి జిల్లాల జట్ల మధ్య జరిగిన పోటీలో ఈస్ట్ గోదావరి విజయం సాధించింది. కర్నూలుపై చిత్తూరు జట్టు, విజయనగరంపై ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా జట్టు, వెస్ట్ గోదావరిపై విశాఖ, ప్రకాశంపై చిత్తూరు, వెస్ట్ గోదావరిపై గుంటూరు జట్టు గెలుపొందాయి.

బాలుర విభాగంలో నెల్లూరుపై కృష్ణా, శ్రీకాకుళంపై కర్నూలు, ప్రకాశంపై వైఎస్ఆర్ కడప, విజయనగరంపై నెల్లూరు, చిత్తూరుపై శ్రీకాకుళం జట్లు విజయం సాధించాయి.

క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జట్లు

హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో కడప, విశాఖపట్నం, అనంతపురం, శ్రీకాకుళం జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి.

ఆస్కాలో నేషనల్ సెక్రటరీగా బాలభాను



ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని సొంట్యాం గ్రామానికి చెందిన కట్టమూరి బాలభాను ఆస్కాలో నేషనల్ సెక్రటరీగా నియమితులయ్యారు. బాలభాను 5వ డాన్ బ్లాక్ బెల్ట్ సీనియర్ మాస్టర్‌గా మార్షల్ ఆర్ట్స్‌లో సొంట్యాం గ్రామంలో ఇండోర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తున్నారు. ఈ మేరకు మార్షల్ ఆర్ట్స్ గౌరవాధ్యక్షులు సుమన్ అభినందించారన్నారు. తనపై నమ్మకంతో సెక్రటరీగా నియమించినందుకు గ్రామీణ ప్రాంతాల్లో మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి నైపుణ్యం పెంపొందించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఓట్లు తొలగిస్తే చర్యలు తీవ్రం : ఆర్‌డిఒ భాస్కరరెడ్డి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

ప్రజాశక్తి-భీమునిపట్నం: ఓట్లు తొలగిస్తే చట్టప్రకారం చర్యలు తీవ్రంగా ఉంటాయని స్థానిక ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి స్పష్టం చేశారు. ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో ఓట్లు లేవంటూ కొందరు ఆందోళన చెందుతున్నారని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందిస్తూ అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోయేందుకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. ఓట్లు తొలగించినట్లు ఆధారాలతో రుజువు చేస్తే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబర్ మొదటి వారంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌ఒలు అందుబాటులో ఉంటారని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని ఆర్‌డిఒ తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సి.హెచ్.వి రమేష్, ఎలక్షన్ డీటీ భాస్కరరావు, వైసిపి నాయకులు గాడు శ్రీను, చిల్ల హరి, చంద్రశేఖర్, టిడిపి నాయకులు వై.అనిల్‌ప్రసాద్, జనసేన నాయకులు నాగోతి నరసింహనాయుడు, బిజెపి నాయకులు రామానాయుడు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదువుకోవాలి

ప్రజాశక్తి -పద్మనాభం : బాలికలు లక్ష్యంతో చదువుకోవాలని విశాఖపట్నం జిల్లా పరిషత్ సిఇఒ. పోలినాయుడు సూచించారు. పద్మనాభంలోని కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలను బుధవారం కొంతమంది అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, భోజనం, వసతి, విద్య తదితరాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ, ప్రతి ఒక్క విద్యార్థీ ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని చదివితే అభివృద్ధి సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు జ్యోతి, శ్రీదేవి, డిపిఆర్ఒ. మణిరామ్, ఎపిసి సమగ్ర శిక్షణాధికారి శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపల్ గ్రేస్ లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతువాక కూడలిలో మొక్కల నాటివేత



మొక్కలు నాటుతున్న పిఎంఒ అదనపు కార్యదర్శి అతీష్ చంద్ర

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ నగరాన్ని పర్యావరణంతో కూడిన పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రీన్ వైజాగ్ అనే నినాదంతో హనుమంతువాక కూడలి వద్ద గల పార్కులో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి కార్యాలయం అదనపు కార్యదర్శి అతీష్‌చంద్ర, జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా, వార్డు కార్పొరేటర్ కొరుకొండ స్వాతీదాస్ హాజరై పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని పలు కూడళ్ళు, రహదారులకు ఇరువైపులా సుమారు 10 వేల మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దామోదర్‌రావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, వైసిపి నాయకులు ఉమ్మడి దాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెను సందర్శించిన జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని బోని రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ సందర్శించారు. వరి పంటలు, కోతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 29వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బోని గ్రామంలో భూమి రీ సర్వే వివరాలను తహశీల్దార్ రామారావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిటి రాజేష్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆంధ్రాయూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలలో వేములవలస గాయత్రీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ బి రామకృష్ణ తెలిపారు. ఈ ఫలితాలలో 95 శాతం ఉత్తీర్ణత గాయత్రీ డిగ్రీ కళాశాల సాధించిందని వివరించారు. బిఎస్‌సి కంప్యూటర్స్ విభాగంలో కంది జ్యోతి 9.04 పాయింట్లు, బిఎస్‌సి రసాయనశాస్త్ర విభాగంలో షిణగం కల్పన 8.6 పాయింట్లు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థుల అభినందన సభలో ప్రిన్సిపల్ దుక్క అప్పలరాజు మాట్లాడుతూ, నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించడం వల్ల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. విద్యార్థుల్లో 8 కంటే ఎక్కువ పాయింట్లు సాధించిన వారు 12 మంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

నేరాలు ఘోరాలు



ఆలయంలో చోరీకి గురైన హుండీ

ఐదు ఆలయాల హుండీల్లో చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఐదు ఆలయాల్లోని హుండీలు మంగళవారం రాత్రి చోరీకి గురయ్యాయి. గ్రామం మధ్యలో ఉన్న రామాలయంలో హుండీతో పాటు వేచలపు వారి కాలనీ వద్ద ఉన్న బంగారమ్మ గుడి, హనుమాన్ గుడి, కొత్త నాగయ్యపేట గ్రామం ఆనుకుని ఉన్న గండిమారమ్మ గుడి, సీతంపేట సమీపంలో ఉన్న మరిడిమాంబ గుడి తదితర ఆలయాల్లోని హుండీలను చోరీ చేశారు. హుండీల్ని నగదును తీసుకొని హుండీలను పంట పొలాల్లో వదిలేశారు. పగటి పూట గ్రామాల్లో తిరిగి పరిశీలించడం, రాత్రి సమయంలో గ్రామ దేవత హుండీల్లో డబ్బులు దొంగలించకపోవడం జరుగుతుంది. గత నెల 3న మారేపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, ఈ నెల 9న దేవరాపల్లి మరిడిమాంబ, చేనులపాలెం పరదేశమ్మ గుడిలోని హుండీ చోరీకి గురయ్యాయి. ఈ విషయమై ఎస్ఐ నాగేంద్ర వద్ద ప్రస్తావించగా ఆలయాల్లో దొంగతనాలపై ఫిర్యాదు అందలేదన్నారు.

ఉడా కాలనీలో చోరీ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి ఉడాకాలనీలో చోరీ జరిగింది. బాధితుడు ధర్మారావు కథనం ప్రకారం... ఉడా కాలనీకి చెందిన ధర్మారావు కుటుంబం ఈ నెల 9న హైదరాబాదులో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంది. ఇంట్లో ఉన్న కిలో వెండి, రూ. 50 వేలు నగదు, చిల్లర సామాన్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేశారు.

పిచ్చికుక్క దాడిలో 8 మందికి గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పాత బస్టాండ్ వద్ద బుధవారం పిచ్చికుక్క దాడిచేయడంతో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వెటర్నరీ విభాగం సిబ్బంది వచ్చి పిచ్చి కుక్కను బంధించి, నగరంలోని కుక్కల సంరక్షణ కేంద్రానికి తరలించారు. గాయాలైన బాధితులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

పద్మనాభంలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి సంబంధించి 72 వినతులు వచ్చినట్లు స్థానిక తహశీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఇందులో 32 వినతులు రెవెన్యూ శాఖకు సంబంధించి, 45 ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై వచ్చినట్లు వివరించారు. రేవిడి పంచాయతీ పరిధిలోని రౌతులపాలెం గ్రామానికి చెందిన పి.ఈశ్వరరావు నాలుగేళ్లుగా వికలాంగుల పింఛన్ అందలేదని ఫిర్యాదు చేశారు. అనంతవరం గ్రామంలో సిసి రోడ్డు, డ్రెయినేజీలు, లింకు రోడ్డు నిమిత్తం నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ జి.వెంకటలక్ష్మి వినతిపత్రం అందించారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో ప్రచారం లేకపోవడంతో ఫిర్యాదుదారులు ఎక్కువగా రాలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, భీమిలి ఆర్‌డిఒ. భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ విజయ్‌కుమార్, జిల్లాస్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్‌సూర్యదీప్తి, విద్యార్థులు

మహిళల ఆరోగ్యంపై సెమినార్

ప్రజాశక్తి-వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో మహిళల ఆరోగ్యంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్యఅతిథి, ప్రముఖ న్యూట్రిషియన్ డాక్టర్ కె.సూర్య దీప్తి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేశాలను ఆమె నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌పట్నాయక్, ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.దయానా పాల్గొన్నారు.

ఘనంగా ములాయంసింగ్ యాదవ్ జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ జయంతిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ములాయం సింగ్ యాదవ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రామ్‌మనోహర్ లోహియా సిద్ధాంతాలు, స్ఫూర్తితో దేశంలో ఏర్పాటైన తొలి పార్టీ అని చెప్పారు. రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీ నిర్మాణం చేస్తామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జిగా జాలాది విజయ వ్యవహరిస్తారని ప్రకటించారు. డాక్టర్ జాలాది విజయ మాట్లాడుతూ, 1992లో ములాయం సింగ్ యాదవ్ ఆంధ్రలో పోటీ చేశారని గుర్తు చేశారు. బడుగు బలహీనవర్గాలు అభ్యున్నతి కోసం సమాజ్ వాదీ పార్టీ కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారత్ మీడియా చైర్మన్ బలివాడ రమేష్, పార్టీ ఏలూరు ఇంఛార్జి రాజా శ్రీనివాస్, సామాజిక విశ్లేషకుడు సన్ మూర్తి, లోకేష్, వర్మ, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి అమర్‌నాథ్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న కరణంరెడ్డి

కరాటే పోటీలకు గుడివాడకు ఆహ్వానం

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ పోర్టు స్టేడియంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరగబోయే అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు బుధవారం ఆహ్వాన పత్రికను ఆయన స్వగ్రామమైన మిందిలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు సతీష్ కుమార్, వైస్‌చైర్మన్ కరణంరెడ్డి నరసింగరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 49, 50, 51 వార్డులకు సంబంధించిన పోలింగ్ బూత్ ఏజెంట్లతో ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త కెకె.రాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో విజయానికి అందరూ సమిష్టిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, సారిపిల్లి గోవింద్, పార్టీ మండల అధ్యక్షులు కృష్ణారావు మాస్టర్, జెసిఎస్ మండల కన్వీనర్లు నీలి రవి, అమర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న వేలం ఆదాయం రూ52.89 లక్షలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఖజానాకు బుధవారం నిర్వహించిన వివిధ రకాల వేలంపాటల షీల్డ్ టెండర్ల ద్వారా రూ.52,89,600 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఉన్న షాపులు, చెప్పులు స్టాండ్ తదితరాలకు షీల్డ్ టెండర్ల వేలం ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. ఈ వేలంలో దేవస్థానం ఎఇఒ వర్మ, సూపరింటెండెంట్లు పాలూరి నర్సింగరావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

యువత దేశ ఆర్థిక ప్రగతికి చోదకంగా నిలవాలి

మిజోరాం గవర్నర్ హరిబాబు

ప్రజాశక్తి-విశాఖపట్నం : యువత ఆలోచనలు దేశ ఆర్థిక ప్రగతికి, పురోభివృద్ధికి చోదకశక్తిగా నిలవాలని మిజోరాం రాష్ట్ర గవర్నర్ కె.హరిబాబు అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఎండోమెంట్ లెక్చర్‌లో ఆయన 'విద్యార్థి యువజన ఉద్యమాలు- దేశ ప్రగతిలో యువతకు అవకాశాలు' అంశంపై హరిబాబు ప్రసంగించారు. 1965 తరువాత జరిగిన వివిధ విద్యార్థి ఉద్యమాలను ఆయన ప్రస్తావించారు. హిందీ భాషకు వ్యతిరేకంగా తమిళనాడులో జరిగిన విద్యార్థి ఉద్యమం, విశాఖ ఉక్కుసాధన ఉద్యమంలో విద్యార్థుల భూమిక, 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, 1972లో ముల్కి నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమం, 1974లో జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉద్యమం, 1975 నాటి ఎమర్జన్సీ పరిస్థితులు, 1979లో అస్సాంలో ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ ఉద్యమం వంటివి వివరించారు. విద్యార్థి ఉద్యమాలు తర్వాతి కాలంలో అనేకమందిని జాతీయ నాయకులుగా తీర్చిదిద్దాయన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మిజోరాం గవర్నర్ కె.హరిబాబు

సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయ భవనం ప్రారంభంలో మేయర్ హరివెంకటకుమారి, కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి నరసింహనగర్-1లో రూ.35.32 లక్షలతో నిర్మించిన సచివాలయ నూతనభవనాన్ని మేయర్ గొలగాని హరివెంకటకుమారి ప్రారంభించారు. సచివాలయం పైన రూ.20 లక్షలతో అదనపు అంతస్తుగా సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివన్నారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజలకు అన్ని విధాలా మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. స్థానిక ప్రజల సమస్య మేరకు సామాజిక భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, నాయకులు కెవి.బాబా, జివి.రమణి, కృష్ణారావు మాస్టర్, బల్లా శ్రీనివాసరావు, లంకా భాస్కరరావు, టిఎస్ఎన్.మూర్తి, చొక్కాకుల రామకృష్ణ, ఇఇ రత్నాకర్‌రెడ్డి, డిఇ శ్రీనివాస్, ఎఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : ఆటో డ్రైవర్లకు ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇవ్వాలని అఖిల భారత మానవ హక్కుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగరపు శ్రీను కోరారు. సంగం థియేటర్ వద్ద జరిగిన ప్రమాదాన్ని పరిశీలిస్తే సిసి ఫుటేజ్ ఆధారంగా ఆటో డ్రైవర్‌దే తప్పుగా కనిపిస్తోందని పేర్కొన్నారు. స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటో డ్రైవర్ జాగ్రత్తలను ఉల్లంఘించి అతి వేగంగా వెళ్లినట్లు స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. విద్యార్థులను తరలిస్తున్న ఆటోలో మ్యూజిక్ సిస్టమ్ ఎక్కువగా పెట్టి పిల్లలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్న ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పరామర్శ

సీతమ్మధార : ఆటో ప్రమాద ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులను తెలుగుదేశం యువనేత ఆడారి కిశోర్ కుమార్ పరామర్శించారు. వారికి మనోధైర్యాన్ని కల్పించారు. అభం శుభం తెలియని చిన్నారులు ప్రమాదానికి గురి కావడం బాధాకరమన్నారు. రోడ్లపై నిర్లక్ష్యంగా వాహనాలు నడిపేవారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రమాద స్థలం వద్ద బుధవారం సాయంత్రం ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు.

జియ్యాని శ్రీధర్‌కు టి-20 మ్యాచ్‌లో కీలక బాధ్యతలు

ప్రజాశక్తి-వేపగుంట : పిఎం.పాలెంలోని ఎసిఎ-విడిసిఎ మైదానం జరిగే ఇండియా, ఆసీస్ టి-20 క్రికెట్ మ్యాచ్‌కు జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. క్రికెట్ మ్యాచ్ ఏర్పాట్లలో ఆహారం, పరిశుభ్రత కమిటీ బాధ్యతలను తనకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపినాథ్ రెడ్డి అప్పగించారని శ్రీధర్ తెలిపారు. గతంలో జరిగిన పలు క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంలోనూ శ్రీధర్ పలు బాధ్యతలు అప్పగించారు.

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న బుధవారం రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, ధనం మూలం ఇదం జగత్ సినిమా యూనిట్ సభ్యులు వేర్వేరుగా దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ పర్యవేక్షకులు రమణ ఆలయ సాంప్రదాయం ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. ఆయన ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

ధనం మూలం ఇదం జగత్ సినిమా యూనిట్ సభ్యులు స్వామి వారి చెంత సినిమా కథను ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా సినీ డైరెక్టర్ రవితేజస్ ప్రజాశక్తితో మాట్లాడుతూ, డిసెంబర్ 9వ తేదీన సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. క్రైమ్ థ్రిల్లర్ రూ.10 హవా చుట్టూ సినిమా తిరుగుతుందని తెలిపారు. ఈ సినిమాలో ఇద్దరేసి హీరోలు, హీరోయిన్లు ఉంటారని చెప్పారు. హీరోయిన్లు ఇతర పాత్రల కోసం జి మా ఆఫీసులో ఆడిషన్స్ ఉంటాయని పేర్కొన్నారు. సినిమా మొత్తం విశాఖపట్నం బీచ్, స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటుందని వివరించారు. రాజేష్, శ్రీధర్ హీరోలుగా, నిర్మాతలుగా రాజేష్ కుమార్, పైడిరాజు, నాగేష్ కుమార్ ఉన్నారని తెలిపారు.

అంగన్‌వాడీ భవనం, సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ పరిధిలోని ప్రకృతివానిపాలెంలో రూ.40 లక్షలతో అంగన్‌వాడీ భవనం, సిసి రోడ్డు నిర్మాణాలకు సర్పంచ్ బిఆర్‌బి నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సహకారంతో గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, 10వ వార్డు మెంబర్ అక్రమాని ఆదినారాయణ, అంగన్‌వాడీ కార్యకర్త అక్రమాని రమణమ్మ, పలబాల రమణ, రోమం శ్రీను, కొలగాని సంతోష్, కొల్లి కనకరాజు, నీలాంతి వెంకట్రావు, యు.పేరయ్య తదితరులు పాల్గొన్నారు.


పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ముత్తంశెట్టి

గొట్టిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకట జగన్, సర్పంచ్ జగదీశ్వర్ 483 ఇళ్లకు వెళ్లి ఇంతవరకు వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. గొట్టిపల్లి పంచాయతీ ఎస్‌సి.కాలనీ, బిసి.కాలనీ, యాతపేట, గొట్టిపల్లి కళ్లాలులో దీర్ఘకాలిక సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ముత్తంశెట్టి అడిగారు. 500 లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం, తాగునీటి పైపులైన్ల పగుళ్ల వల్ల నీరు సరిగా అందడం లేదని, మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని, సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడపా లవరాజు, ఆర్ఐ మణికంఠ, వైసిపి నాయకులు మజ్జి వెంకటరావు, పాండ్రంకి శ్రీను, బొట్ట రామకృష్ణ, ఇల్లాపు వెంకట్ జగన్, సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, బంటుపల్లి మణిశంకర్‌నాయుడు, రైతు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ

దేశ వ్యాప్త కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పరవాడ ఫార్మా సిటీలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ధరలు నియంత్రించాలని, ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై ఎక్సైజ్ పనులు తగ్గించాలని, లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రి వెంకునాయుడు, ఎ.రాజా, కె.పోతునాయుడు, పి చిన్నారావు, సత్తిబాబు, కృష్ణ, పెంటారావు, కనకారావు, దేవుడు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

మునగపాక రూరల్ : మహాధర్నాను జయప్రదం చేయాలని స్థానిక మెయిన్ రోడ్‌లోని ప్రజా సంఘాల కార్యాలయం ఆవరణలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా అమ్మేస్తున్నారని, రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడం



మాట్లాడుతున్న సిఐటియు నేత శ్రీనివాసరావు

లేదని, ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు, మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీల సేవలో మునిగి తేలుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ, కో కన్వీనర్ అంజలి, టెక్కలి జగ్గా అప్పారావు, పద్మ, లక్ష్మి, కామేశ్వరి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సబ్బవరం : సబ్బవరం తహసిల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు, రైతులకు, ప్రజలకు, దేశానికి వ్యతిరేకమైన వినాశకరమైన కార్పొరేట్ అనుకూల విధానాలు అనుసరిస్తుందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల సమన్వయ కమిటీ కన్వీనర్ వి.వి.రమణమ్మ, నాయకులు ఎం గోరేశ్వరరావు, ఎం రమణి, వివోఏ నాయకురాలు లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు యు.సత్యవతి పాల్గొన్నారు.

సిపిఐ కార్యాలయంలో సమావేశం

అనకాపల్లి : రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27, 28, తేదీలలో రెండు రోజులపాటు విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్. భద్రం పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం జరిగిన రైతు, కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏఐటియుసి, రైతు సంఘం నాయకులు గనిశెట్టి ఏసుదాసు, కోరిబిల్లి శంకర్రావు, మత్తుర్తి సూరిబాబు పాల్గొన్నారు.



పాఠశాల హెచ్ఎం స్వర్ణలతతో ఎంపికైన విద్యార్థులు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జరుగు 14వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న వీరు ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు బుధవారం అభినందించారు.

రూ.50 లక్షలతో శాంతి పార్కు అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో శారద నది ఒడ్డున ఉన్న శాంతి పార్కును సుమారు 50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్లు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్కు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అదనపు హంగులతో త్వరలో అనకాపల్లి పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు, చిన్నారులకు ఆహ్లాదాన్ని , ఉల్లాసాన్ని కలిగించే విధంగా సర్వాంగ సుందరంగా శాంతి పార్కు సిద్ధమవుతుందని చెప్పారు. శమ ఉమాధర్మలింగేశ్వరుని ఆలయ చెంతనే వున్న ఈ పార్కు అభివృద్ధికి తన ఎంపీ లాడ్స్ నిధులు ఇప్పటికే 10 లక్షలు విడుదల చేసి మౌలిక సదుపాయల కల్పనకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ మందపాటి జానకి రామరాజు, మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో కలిసి జీవీఎంసీ కమిషనర్‌ను కలిశామని, అదనపు నిధులతో ఒక మోడల్ పార్క్‌గా అభివృద్ధి చేయమని కోరామని, దీంతో ఆయన రూ.49.83 లక్షల నిధులు విడుదల చేసి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఆమె వెంట వైసిపి నాయకులు గ్రిపూరి రాజు తదితరులు ఉన్నారు.

25న బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గంలో ఈ నెల 25న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్, ఉత్తరాంధ్ర బస్సు యాత్ర ఇన్చార్జ్ లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు 25న సబ్బవరంలో జరగబోవు బహిరంగ సభ ప్రాంగణ స్థలాన్ని వారు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25న ఉదయం వేపగుంట జంక్షన్ వద్ద ప్రారంభమై ర్యాలీగా సబ్బవరం మధ్యాహ్నం చేరుకుంటుందని, అనంతరం భారీ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు.

ముఖ్యమంత్రి జగన్ బీసీ ద్రోహి

ప్రజాశక్తి-అనకాపల్లి : బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ.75 వేల కోట్లు దారి మళ్లించిన బీసీల ద్రోహి జగన్ రెడ్డి అని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 44 శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే జగన్ రెడ్డి 24 శాతానికి కుదించి, 16,800 వేల రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేసి బీసీల గొంతు కోస్తున్నారని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వం కుల సంఘాల ఫెడరేషన్ల ద్వారా 4 లక్షల మందికి రూ.3700 కోట్లు సబ్సిడీ రుణాలు ఇస్తే, 56 కార్పొరేషన్లు పెట్టిన జగన్ రెడ్డి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. జగన్ రెడ్డి బీసీల నుండి 8 వేల ఎకరాల అసైన్ భూముల్ని బలవంతంగా లాక్కున్నారన్నారు. సమావేశంలో బీసీసెల్ నాయకులు గిరిజాల లక్ష్మణరావు, మాదంశెట్టి నీలబాబు, భీమరశెట్టి శ్రీనివాసరావు, గుర్రం నూకరాజు, కాండ్రేగుల సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, రేసుపూడి రమణ, అద్దు శంకర్రావు, మళ్ల లోవ కృష్ణ, విల్లూరి రమణబాబు, కోన శ్రీను, వేగి వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీష్



బియ్యం అందిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

అన్న సమారాధనకు బియ్యం వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామంలో గురువారం జరిగే శ్రీనివాస కళ్యాణం నిమిత్తం అన్న సమారాధన కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు పది బస్తాల బియ్యం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ మాట్లాడుతూ దైవ కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఇద్దరు దాతలు ఒక్కొక్కరు ఐదు లక్షల చొప్పున 10 లక్షల రూపాయలను బుధవారం ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్‌లకు అందజేశారు. విశాఖపట్నం సీతమ్మధార ప్రాంతానికి చెందిన క్రిన్హా ఫ్యాషన్స్ అధినేత సిగాటపు సుధీర్ హేమలత దంపతులు, అమెరికా వాస్తవ్యులు కర్రి సూర్యనారాయణ, రమాజ్యోతి దంపతులు విరాళాన్ని అందజేయగా వారిని ఆలయ మర్యాదలతో ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంత వరకు ఆలయ నిర్మాణానికి దాతల నుంచి రూ.30 లక్షలు విరాళం అందినట్లు తెలిపారు. దాతలకు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బుద్ద నరసింగరాజు, పీల లక్ష్మి శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, పాము అనురాధ సన్నీ బాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మల్లవరపు ఈశ్వరరావు, యనమండ్ర శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలియజేశారు.

కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి కేంద్రీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

18, 19 సంవత్సరాలు యువ ఓటర్లు తప్పక నమోదయ్యేలా బిఎల్ఓలు, బిఎల్ఏలు దృష్టి పెట్టేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పేదలు, నిరక్షరాస్యులు ఉన్న ప్రాంతాలలో వారి కుటుంబంలో కొత్తగా ఓటు హక్కు వయసు వచ్చిన పిల్లలను గుర్తించి వారి ఓటు నమోదయ్యేలా చూడాలని సూచించారు. జంక్ క్యారెక్టర్లు ఉన్న గృహాలలో ఓటర్ల పరిశీలన దాదాపు పూర్తయిందని చెప్పారు. మాడుగుల, ఎలమంచిలి నియోజకవర్గాలలో మాత్రమే 21 జంక్ క్యారెక్టర్లు ఉన్నాయన్నారు. ఈనెల 15 నుండి 21వ తేదీ వరకు ఫారం 6, 7, 8ల ద్వారా 8,814 క్లైములు స్వీకరించినట్లు చెప్పారు. 21వ తేదీ వరకు క్లైములు, అబ్జెక్షన్స్ 36,521 పెండింగ్ ఉన్నాయన్నారు. ఓట్ల దిద్దుబాటుకు 11,098 ఫారాలు సేకరించి ఈఆర్ఓ నెట్‌లో 9,807 ఓట్లను చేర్చడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.రామకృష్ణ (వైసిపి), బి.శ్రీనివాసరావు (టిడిపి), పి.నాగేశ్వరరావు (బిజెపి), కె.హరినాథ బాబు (ఆమ్ ఆద్మీ), డి.సంతోష్ (కాంగ్రెస్), ఎస్.వి.వి.రామచంద్రరావు (బిఎస్పి), ఆర్.శంకరరావు (సిపిఎం), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డిటి రవి కుమార్, ఎస్ఏ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడివాడ గురునాథరావు వర్ధంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీమంత్రి గుడివాడ గురునాథరావు 22వ వర్ధంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామపంచాయతీలో ఉన్న గుడివాడ గురునాథరావు విగ్రహానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్ యాదగిరి అప్పారావు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అయిత ఆనంద రాము, వైసిపి నాయకులు యనంశెట్టి శ్రీనివాసరావు, యాదగిరి రామచంద్రరావు, వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, గ్రామ వీఆర్పీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో...

అనకాపల్లి రింగ్ రోడ్డులో ఉన్న వైసిపి కార్యాలయంలో గుడివాడ గురునాథరావు చిత్ర పటానికి వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఆసుపత్రి డైరెక్టర్లు జి.రామ్మూర్తి, మునూరి శ్రీను, వైసిపి నేతలు జాజుల రమేష్, కొణతాల మురళీకృష్ణ, బొడ్డేడ శివ, కేఎం నాయుడు, సుదురుపాటి తాతాజీ, సకలా గోవింద్, బుద్ద రాజు, కొందూరి రవీంద్ర, మల్లవరపు ఈశ్వరరాజు, బొడ్డేడ నరసింహమూర్తి, కోరుకొండ రాఘవ, ఉగ్గిన అప్పారావు, గుండా రమేష్ గుప్తా, జోగిరాజు, కోన ఉమ, పలకా వాసు, మాదురి నాయుడు, కళ్యాణ్, అల్లు త్రినాద్, మహాలక్ష్మి నాయుడు, డొంక సత్య, అప్పలరాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : మాజీ మంత్రి, కీర్తిశేషులు గుడివాడ గురునాథరావు ఆశయాలను కొనసాగించే శక్తి సామర్థ్యాలు మంత్రి అమర్నాథ్‌కు ఉన్నాయని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. అమర్నాథ్ తండ్రి గురునాథరావు 22వ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం జరిగాయి. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న గురునాథరావు విగ్రహానికి సుబ్బారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురునాథరావు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఈ ప్రాంతానికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. నివాళు లర్పించిన వారిలో మంత్రి అమర్నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఉపాధ్యక్షులు పీలా ఉమారాణి ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం ఎల్.సింగవరం గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో కిడ్నీ బాధితులు 18 మందిని గుర్తించి వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వడ్డాది పిహెచ్సి డాక్టర్ సిహెచ్ శకుంతల మాట్లాడుతూ ప్రజలందరూ గుట్కా, సిగరెట్, పాన్ పరాక్ వంటి మత్తు పదార్థాలకు, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. రాగులు, గంట్లు, సజ్జలు, కొర్రలు, ఆకుకూరలు వంటి పౌష్టికమైన ఆహారాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేపాడ మధు, ఏఎన్ఎం ప్రభావతి, ఎమ్ఎల్హెచ్పి హేమశ్రీ, మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సబ్బవరం : మండలంలోని సబ్బవరం, గుల్లేపల్లి పిహెచ్సిల పరిధిలోని వైద్య సిబ్బందికి స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఫ్లోరోసిస్‌పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాధం ముఖ్య అతిథిగా పాల్గొని ఫ్లోరోసిస్ రావడానికి గల కారణాలు, నివారణకు తీసుకోవలసిన చికిత్స, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ ఎం.వి రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఎంపిఈఓలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని నాగవరం గ్రామానికి చెందిన గిన్ని ప్రవీణ్ కుటుంబానికి స్థానిక ఎంపిటిసి సభ్యులు పాలిపిని శ్రీనివాసరావు రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. ప్రవీణ్ భార్య ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించారు. దీంతో ఆ కుటుంబం పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించిన శ్రీనివాసరావు ప్రవీణ్ కుమార్తె వివాహం నిమిత్తం ఈ రూ.25వేలు అందజేశారు. శ్రీనివాసరావు ఉదారాతను గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో ప్రవీణ్ కుటుంబీకులు, గ్రామ పెద్దలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో కోట్నీ వీధికి చెందిన కోట్ని మహాలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో వైయస్సార్ బీమా లక్ష రూపాయలు, అంత్యక్రియలు నిమిత్తం తక్షణ సాయం కింద పదివేల రూపాయలు చెక్కులు 84వ వార్డు వైసిపి ఇంచార్జ్ కోరుకొండ రాఘవ బుధవారం గొల్లవీధి 10వ సచివాలయంలో మృతురాలి తల్లి సత్యవతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మృతిచెందితే ఆ కుటుంబం ఇబ్బందులు పడకుండా వైఎస్ఆర్ బీమా ఇచ్చి ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ ప్రసాద్, వాలంటరీలు పాల్గొన్నారు.

నాట్య బృందానికి అభినందనలు

ప్రజాశక్తి- పరవాడ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్రభారతిలో పక్షం రోజుల పాటు భరత్ ఆర్ట్స్ అకాడమీ వారు భరత్ బాలోత్సవ్ పేరుతో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ నాట్య బృందాన్ని బుధవారం ఆ పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు సంస్కృతి గ్లోబల్ స్కూల్ నృత్య విభాగం నుండి 13 మంది విద్యార్థినుల నాట్య బృందం పాల్గొని నయనానంద భరితమైన నృత్యాన్ని ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యకు అనుబంధమైన ఆట, పాట, నృత్యం, చిత్రాలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం వంటివి చాలా అవసరమని పేర్కొన్నారు. ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొనేందుకు కృషి చేసిన వారి తల్లిదండ్రులను పాఠశాల డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ, ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, సీఈఓ కె.నిశంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, నృత్య శిక్షకులు జ్యోతిర్మయి, పూజితలను అభినందించారు.

ఎంవిఆర్ ఆధ్వర్యాన ఉచిత తీర్థ యాత్ర

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత తీర్థయాత్ర బస్సు మండలంలోని తిమ్మరాజుపేట గ్రామం నుండి బుధవారం బయలుదేరింది. దీనిని అనకాపల్లి నరసింగరావుపేటలో ఉన్న ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యాలయం వద్ద ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ ప్రారంభించారు. ఈ యాత్ర ద్వారా ప్రముఖ పుణ్యక్షేత్రాలు సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాలను దర్శించుకోనున్నారు. తీర్థయాత్రకు బయలు దేరిన వారికి ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి అల్పాహారం, తాగునీరు సమకూర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంజూ బాబు టీం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి

- రైలు బ్రిడ్జి, పెంజెరువు దురాక్రమణపై సిపిఎం ఫిర్యాదు



సమస్యలు విన్నవిస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి

పౌరుల సమస్యలు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించడం, స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందనకు ఆమె అధ్యక్షత వహించి ఫిర్యాదులు స్వీకరించారు. ఆమె వెంట జిల్లా యంత్రాంగమంతా వచ్చి 13 కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించారు. వీటిలో వ్యక్తిగత సమస్యలు, వివిధ పథకాలకు చెందిన సమస్యలు, సాధారణ సమాచారం తదితర విభాగాలుగా సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో 91 ఫిర్యాదులు రాగా వాటిలో అత్యధికంగా 56 రెవెన్యూ ఫిర్యాదులే కావడం విశేషం. రెవెన్యూ, ఇళ్లు, పెన్షన్ల పట్ల ఎక్కువ ఫిర్యాలు అందినట్లు అధికార్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ మంజులావాణి, ట్రైనీ కలెక్టర్ స్వరణ్‌రాజ్, అనకాపల్లి ఆర్డీఒ ఎజి చిన్నికృష్ణ, స్థానిక తహశీల్దార్ రాణిఅమ్మాజీ, ఎంపిడిఒ అప్పలనాయుడు, సూపరింటెండెంట్ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఆచారి, సర్వేయర్ రామారావు, అన్ని విభాగాల జిల్లా అధికార్లు పాల్గొన్నారు. పాల్గొన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా మెగా ఫిర్యాదుల శిబిరం ఏర్పాటు చేయడం పట్ల పౌరులు సంతృప్తి వ్యక్తం చేశారు.

రైలు బ్రిడ్జి, పెంజెరువు దురాక్రమణపై సిపిఎం ఫిర్యాదు

రైతుసంఘం, సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, ఆర్.రాము పలు ఫిర్యాదులు అందించారు. రైల్వే వంతెన సమస్య 14 ఏళ్లగా నానుతోందని పేర్కొన్నారు. పెంజెరువు భూములు ఆక్రమించిన వారిని తొలగించాలని, కొక్కిరాపల్లి సొసైటీ తీసుకున్న రుణాలు రద్దయినా బ్యాంకు అధికార్లు కట్టాలని ఒత్తిడి తెస్తున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏటికొప్పాక రైతులకు ఫ్యాక్టరీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రైతు సంఘం నాయకులు కోరుమిల్లి సత్యనారాయణ, కె.కూర్మారావు ఉన్నారు.

కులగణన పారదర్శకంగా చేయాలి



మాట్లాడుతున్న పంచాయతీ ఇఓ నారాయణరావు

ప్రజాశక్తి-చోడవరం

నిర్దేశించిన నియమాలను పాటించి కులగణనను పారదర్శకంగా చేయాలని చోడవరం పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు ఆదేశించారు. పంచాయతీ కార్యాలయం వద్ద వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి కులగణనపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాలంటీర్ క్లస్టర్‌కు సచివాలయ ఉద్యోగిని కేటాయించినట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లినప్పుడు వారు ఏ కులం చెబితే అది నమోదు చేయాలని, వాదోపవాదాలకు తావివ్వకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, వార్డు సభ్యులు ఒరుగంటి నెహ్రూ నాగమణి, ఎంపిటిసి పుల్లేటివ్ శ్యాం, బొడ్డు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒలతో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్స్ (బిఎల్ఒ)తో మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ జె.మాధవి బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనర్హుల ఓట్ల తొలగింపు, అర్హతగల వారి ఓట్ల చేర్పు, ఓటర్లలో స్త్రీ, పురుషుల నిష్పత్తి, ఎలక్టోరల్ పాపులేషన్ (ఇ.పి.) రేషియో, 18-19 సంవత్సరాల వారి ఓట్లు నమోదుపై ఇఆర్ఒ మాధవి సమీక్ష జరిపారు. తహసీల్దార్ జె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్ష సమావేశంలోఉప తహసీల్దార్ డి.రమేష్ బాబు, ల్యాండ్స్ రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సూరి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానకి, స్టాఫ్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి - కసింకోట

తమను పర్మినెంట్ చేయాలని, వేతన బకాయిలు ఇవ్వాలని కోరుతూ సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కశింకోటలోని సెయింట్ జాన్స్ ప్రైవేట్ పాఠశాలలో విద్యా శాఖ సిబ్బందికి శిక్షణ జరుగుతున్న నేపథ్యంలో అక్కడికి వచ్చిన డిఇఒ, ఎడిఎ రవిబాబుకు వినతిపత్రం ఇవ్వడానికి ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగులు వచ్చారు. ఎడిఎ రవిబాబు వారిని పట్టించుకోకుండా, కారు ఆపకుండా ముందుకు వెళ్లడంతో ఆందోళనకారులు అడ్డగించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో కారు టైర్ కింద పడి జానీష్ కాలుకు గాయాలయ్యాయి. దీంతో ఆగ్రహించిన ఆందోళనకారులు అక్కడే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రమోషన్ ఇవ్వలేదని, మూడు నెలలుగా గౌరవేతనం చెల్లించలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు పి వెంకట్రావు, జి సంతోష్ కుమార్, జి నాగేశ్వరరావు, మహమ్మద్, ఆర్ రవి, సిహెచ్ విజయ్, పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అధ్యక్షతన బుధవారం గ్రామసభ జరిగింది. ఎన్ఆర్ఈజిఎస్ పనుల తీరు, గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా, అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామజోగి నాయుడు, సచివాలయ కార్యదర్శి, ఆశా వర్కర్లు, వాలంటీర్లు, అంగన్వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సముద్ర తీరంలో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తంతడి నుంచి కొత్తపట్నం వరకు సముద్ర తీరంలో 25 హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు మెరైన్ పోలీస్ ఎస్ఐ మల్లేశ్వరరావు స్వీటీ తెలిపారు. హెచ్చరిక బోర్డులు పెట్టిన ప్రదేశాల్లో సముద్రం ఆటుపోట్లు, నేల స్వభావం ప్రమాద భరితంగా ఉంటుందని, ప్రదేశాల్లో సముద్రంలో స్నానానికి దిగరాదని, సముద్రం నీటిలోకి వెళ్లరాదని చెప్పారు. ఎవరైనా హెచ్చరికలు ఖాతరు చేయని పక్షంలో చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఇస్రో గ్రూపు సంస్థ హెచ్చరిక బోర్డులను తయారు చేసి మెరైన్ పోలీస్ స్టేషన్‌కు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఏఎస్ఐ రాజు, సిబ్బంది నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటరు జాబితాలో తప్పులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, ఓటరు జాబితాలో అవకతవకలకు పాల్పడిన బిఎల్ఒలపై చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓట్ల నమోదుపై యువతకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఓటరు జాబితాలో 4వేల పైగా ఉన్న మరణించిన, డబుల్, దొంగ ఓట్లపై విచారణ జరిపి వెంటనే తొలగించాలని కోరారు. కొంతమంది బిఎల్ఓ లు వాలంటీర్ల సహాయంతో మరణించిన వారి పేర్లను కూడా జాబితాలో చేర్చారని ఆరోపించారు. ఓటరు జాబితాలో రెండు, మూడు నియోజకవర్గాల్లో వారికి ఓట్లు ఉన్నాయని, అలాంటివి గుర్తించడంలో మండల ఎన్నికల అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పచ్చికూర రాము, తలారి కాశీ నాయుడు, తలారి లక్ష్మీ ప్రసాద్, కరణం రమణ, ఆళ్ళ జగన్, కర్రి వర తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఓటర్ జాబితాలో ఉన్న దొంగ ఓట్లు తొలగించాలని బిజెపి మాడుగుల నియోజకవర్గ కన్వీనర్ మేడపరెడ్డి శ్రీనివాసరావు బుధవారం తహశీల్దారు రమేష్ బాబుకు వినతిపత్రం అందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ దొంగ ఓట్లు ఉన్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కోటాని ఈశ్వరరావు, ఇమంది శ్రీనివాసరావు, కోమర అప్పారావు, డి.రమణ పాల్గొన్నారు

ఉత్తమ పర్యాటక గ్రామాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో పర్యాటక రంగంలో ఉత్తమ పర్యాటక గ్రామాలు-2024 ఎంపికకు పర్యాటక మంత్రిత్వ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి డాక్టర్ ఏ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, బాధ్యతాయుత, కళాకృత ఖండాల, కమ్యూనిటీ ఆధారిత, ఆరోగ్య రంగాలకు సంబంధించిన విశిష్టతలు కలిగిన గ్రామాలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను www.rural.tourism.gov.in వెబ్ సైట్‌లో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉత్తమ పర్యాటక గ్రామం కేటగిరీలకు ఎంపికైన గ్రామాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురస్కారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8009414743, 8985754583 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సీజ్ చేసిన వాహనాలతోనే చిక్కులు!

- రోడ్డుకు ఇరువైపులా ఏళ్ల తరబడి తిష్ట
- వర్షపు నీరు మళ్లే వీలులేక రహదారి ఛిద్రం
- పట్టించుకోని ఎస్ఇబి, ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం నుండి చింతపల్లి వెళ్లే మార్గంలో రోడ్డు వెంబడి ఇరువైపులా గంజాయి, సారాతో పట్టుబడ్డ వాహనాలను ఏళ్లతరబడి అలాగే వదిలేయడంతో సమస్యలు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పట్టుకుని సీజ్ చేసిన వ్యానులు, కారులు, ఆటోలు, ఇతర వాహనాలను నర్సీపట్నం నుండి చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా కొన్ని సంవత్సరాలుగా అలాగే ఉంచడంతో వాటిల్లో తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. అంతేకాక దిక్కుమొక్కూ లేకుండా వీటిని అలాగే వదిలేయడంతో రోడ్డు అంచుల్లో ఇరువైపులా మట్టి దిబ్బలు పేరుకుపోయి ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి, రోడ్డు కాస్తా ఇరుకుగా మారింది. అంతేకాక వర్షం కురిస్తే, రోడ్డు అంచుల్లో ఉన్న ఈ వాహనాల వల్ల నీరు రోడ్డు పక్కలకు మళ్లిపోయే వీలులేక రోడ్డుపైనే నిలిచిపోవడంతో తారురోడ్డు శిథిలమై నిండా గోతులమయంగా మారి పూర్తిగారూపుకోల్పోయిందని వాహనదారులతోపాటు ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షపు నీరు ఎటుపోకుండా రోడ్డుపైనే ఉండిపోవడంతో తారురోడ్డు దెబ్బతిని మెటల్ లేచిపోయి, పెద్దగోతులతోపాటు, రోడ్డు పైన ఇరువైపులా మెటల్, మట్టి దిబ్బలుగా ఏర్పడి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారిందని పలువురుల అంటున్నారు. అసలే ఏళ్ల తరబడి నిర్వహణ, పునర్నిర్మాణం లేక, అధ్వానంగా తయారైన రోడ్డుకు, ఇక్కడ రోడ్డుపక్కన ఉంచిన సీజ్ చేసిన వాహనాలతో మరింత కష్టాలు పెరిగాయని ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఏజెన్సీ ప్రాంతానికి సరుకులు రవాణా చేసే లారీలు వంటి భారీ వాహనాలతోపాటు బస్సులు, ఇతర వాహనాలు ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. గంజాయి, సారాయి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పలుచోట్ల వేలం వేసి, క్లియర్ చేసే పరిస్థితులు ఉన్నప్పటికీ, నర్సీపట్నంలో ఎందుకనో ఏళ్లతరబడి అలాగే వదిలేశారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టి, రోడ్డు రక్షణ, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని రోడ్డు అంచుల్లోనే నిలిపేసిన సీజ్ వాహనాలను క్లియర్ చేయించాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు అంచుల్లో ఏళ్లతరబడి ఉన్న సీజ్ చేసిన వాహనాలు



ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలోసీజ్ చేసిన వాహనాఉ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పలుచోట్ల 'ఎపికి జగన్ ఎందుకు కావాలంటే'లో నేతలు



నర్సీపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : సీఎం జగన్ పాలనలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 28వ వార్డులో ఏపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు, పార్టీలు చూడకుండా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడ, మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలోని ఎం కోడూరు సచివాలయ పరిధిలో ఎపికి జగన్ ఎందుకు కావాలి, పల్లెకు పోదాం రా కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం మండల వైస్ ఎంపిపి తాళ్లపురెడ్డి రాజారామ్ ఆధ్వర్యంలో వైసిపి పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌నుమళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మీనా కుమారి, ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవెల్లి సంజీవరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు గొల్లవెల్లి రాజేష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండ : సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు అన్నారు. బుధవారంమేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో సర్పంచ్, జిల్లా వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత అధ్యక్షతన ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యానారాయ, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, మాజీ సర్పంచ్ లగుడు మురళీ, ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రఘు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరాపల్లి :రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పేదలకు విద్య, వైద్యంతో పాటు వారి జీవన ప్రమాణస్థాయి పెంచేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, జడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. మండలంలోని పెదనందిపల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం స్థానిక సర్పంచ్ సోమిరెడ్డి సన్నిబాబు అధ్యక్షతన జరిగిన ఎపికి జగన్ ఎందుకు కావాలి, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల్లో భాగంగా వైసిపి జెండాను వారు ఆవిష్కరించారు. పెదనందిపల్లి పరిధిలో సుమారు రూ.5 కోట్ల 80 లక్షలు ఖర్చు చేసినట్లు వారు చెప్పారు. ఇన్చార్జి ఈఓపిఆర్‌డి సంతోష్ నళిని, వైసిపి నాయకులు బూరె బాబురావు, కెవి.రమణ, గాలి వెంకునాయుడు, ఉర్రుకల అప్పారావు, ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని నాయుడు పాలెంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బోర్డును, వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, చల్ల కనకరావు, బండారు కృష్ణబాబు, ఉప సర్పంచ్ రాజాన ముత్యాలయ్య, రమాదేవి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం మండలంలోని కొండకర్ల గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లాలం రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, వైసిపి నాయకులు ఈ.వాసురాజు, కోన బుజ్జి, కొట్ని శివ, బిల్లా ప్రకాష్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం సచివాలయ పరిధిలో ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బంక సత్యం, సూర్యనారాయణ, పాండ్రంకి శ్రీను, వెంకట్రావు, లొడగల రాజేశ్వరిరమణ, ఆర్.శ్యామల వెంకటరావు, పాండ్రంకి అప్పారావు, ఉదయ్ శంకర్, అనురాధ, పాల్గొన్నారు.

భీమునిపట్నం : వైసిపి పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎంపిపి దంతులూరి వెంకట శివసూర్యనారాయణరాజు (వాసు రాజు) తెలిపారు. ఎపికి జగన్ ఎందుకు కావాలి ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని మూలకుద్దులో బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. నాలుగేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని తెలిపే బ్రోచర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా అర్హత ఒక్కటే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, వైస్ ఎంపిపి బి.బంగారునాయుడు, నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, చిల్ల హరి పాల్గొన్నారు



భీమిలిలో బ్రోచర్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి వాసురాజు

నేడు సైన్స్ మ్యాజిక్ షో

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 7 నుండి వచ్చే ఫిబ్రవరి 28వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న నేషనల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా ఈ నెల 23న ఉదయం నర్సీపట్నం కారుణ్య స్కూల్, సాయంత్రం వేములపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ మ్యాజిక్ షోలు నిర్వహిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులరెడ్డి తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

వైద్యులకు ఘనసత్కారం



డాక్టర్లను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఐదు రోడ్ల జంక్షన్ వద్ద బ్రహ్మకుమారీస్ విశాఖ, నర్సీపట్నం సెంటర్ ఇన్‌చార్జ్ బికె.వేణు, బికె.లక్ష్మీ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని పలువురు డాక్టర్లు, స్టాఫ్‌నర్సులను ఘనంగా సన్మానించారు. డాక్టర్ నళినిప్రసాద్, డాక్టర్ హనుతేజ్, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ వైఎల్‌విఎస్ఎస్.రాజు తదితర డాక్టర్లను ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

ప్రజాశక్తి - మాడుగుల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వార్షిక ఆడిట్ నిర్వహించారు. బుధవారం ప్రత్యేక బృందం కళాశాలను సందర్శించి వసతులు, బోధనభ్యాస విధానాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి, ఇతర అధ్యాపకులు ఆడిట్ బృందానికి అవసరమైన వివరాలు, రికార్డులు అందించారు ఈ సందర్భంఆ కళాశాలలోని బోధన అభ్యసనాలు, వసతి పట్ల ఆడిట్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఆడిట్ టీంలో రాజు, చల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణస్వామి వ్రతాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఈ నెల 23న శ్రీరమాసమేత సత్యనారాయ స్వామి దేవస్థానంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. గురువారం విద్యార్థులు, ఉద్యోగుల సౌకర్యార్థం ఉదయం 6 గంటలకు మొదటి బ్యాచ్, మరలా 9.30 గంటలకు 2వ బ్యాచ్ వ్రతాలు నిర్వహిస్తామన్నారు. వ్రతాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అంగన్వాడీల సమ్మె నోటీస్

ప్రజాశక్తి - మాడుగుల : తమ సమస్యలను పరిష్కరించకుంటే వచ్చేనెల 8 నుంచి సమ్మె చేయక తప్పదని అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు హెచ్చరించారు. ఈమేరకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేషు ఆధ్వర్యంలో మాడుగుల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ శ్రీదేవికి సమ్మె నోటీస్‌ను అందించారు. మాడుగుల నియోజకవర్గం పరిధిలోని మాడుగుల చీడికాడ మండలాలకు చెందిన 50 మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. అంగన్వాడీల సమస్యలకు సంబంధించి 12 అంశాలతో కూడిన డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో డిసెంబర్ 8 తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోనికి వెళ్తున్నామన్నారు. మాడుగుల నియోజకవర్గ అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అడ్డురోడ్డు ప్రయాణం అడ్డదిడ్డం!

- గోతులు, మలుపులతో గమ్యం చేరే వరకు భయం భయం
- అధ్వాన రహదారిని పట్టించుకోని నేతలు, అధికారులు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు, ప్రజలు

ప్రజాశక్తి-కోటవురట్ల : అసలే గోతులు, ఆపై మలుపులు, దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు..ఇలా అడ్డురోడ్డులో ప్రయాణమంటేనే ప్రజలు, వాహనదారులు హడలిపోయే పరిస్థితి నెలకొంది. మండల కేంద్రం నుండి అడ్డరోడ్డు ప్రయాణం అంటే వెనకడుగు వేసే పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు., ప్రభుత్వం వచ్చి నాలుగున్నరేళ్లుపూర్తి చేసుకున్నా, అడ్డురోడ్డు వెళ్లే దారిలో ప్రయాణకష్టాలు పట్టించుకునే దిక్కులేదని స్థానికులు వాపోతున్నారు. రామచంద్రపురం నుండి అడ్డరోడ్డు వెళ్లే వరకు అవస్థలు అంతాఇంతా కాదు. ఇక రాత్రి సమయంలో ప్రయాణం గుండె గుబులు. ఒకపక్క గోతులు, మరోవైపు మలుపులు, దీనికి తోడు తుప్పలు ఇలా ప్రయాణసంకటంగా ఉన్న మార్గంలో గమ్యం స్థానం చేరే వరకు వాహనదారులు గుండెను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే. నిత్యం ఇదే మార్గంలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సహా డివిజన్ జిల్లా స్థాయి అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినా కనీసం రోడ్డు గురించి పట్టించుకోలేదని స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు, ఇందేసమ్మవాక వద్దనుండి అడ్డు రోడ్డు వెళ్లే వరకు ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భారీ వాహనాలు సహా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, పోలవరం కాలువ వద్ద రోడ్డు సమీపంలో నిర్మాణం కోసం తీసిన గొయ్యి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది, రోడ్డుకు ఇరువైపులా వెడల్పు చేయడం కోసం గోతులు తవ్వి వదిలేయడం, కనీసం అధికారులు సైతం పట్టించుకోకపోవడం దారుణమంటూ ఆయా ప్రాంతవాసులు తీవ్ర విమర్శలు గుర్తిస్తున్నారు అధికారులు నాయకులు ఎప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని కోరుకుంటున్నారు.


నిండా గోతులతో దర్శనమిస్తున్న అడ్డురోడ్డు రహదారి


రహదారిలో ప్రమాదకరమైన మలుపులు, ఇరువైపులా తుప్పలు

కత్తిసాము పోటీల్లో కృష్ణవేణికి స్వర్ణం


కృష్ణవేణిని అభినందిస్తున్న హెచ్ఎం

ప్రజాశక్తి -చీడికాడ : రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీల్లో మండలంలోని వరహాపురం హైస్కూల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని విసారపు కృష్ణవేణి అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మొదటిస్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి కత్తి సాము పోటీల్లో కష్ణవేణి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, సర్టిఫికెట్ కైవనం చేసుకుందని పాఠశాల వ్యాయము ఉపాధ్యాయులు సింహాచలం తెలిపారు. రాష్ట్రస్థాయి కత్తి సాము పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించిన కృష్ణవేణిని పాఠశాల హెచ్ఎం వరహామూర్తి వ్యాయమ ఉపాధ్యాయులు సింహాచలం వైస్ ఎంపిపి స్వాతి, సర్పంచ్ చిన్నమ్మలు, మండల వైసిపి కన్వీనర్ గొల్లవిల్లి రాజుబాబు అభినందించారు

మైదానంలో మంచు సోయగం


మైదాన ప్రాంతంలో కమ్ముకున్న పొగమంచు

ప్రజాశక్తి -కోటవురట్ల: వాతావరణ మార్పుతో మండలంలో బుధవారం ఉదయం మంచు సోయగం దర్శనమిచ్చింది, దీంతో ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేయగా, రైతులు ఆవేదన చెందుతున్నారు. మంచు కురియడం మొదలైతే వర్షాలు ఎత్తిపెట్టినట్టేలనని ఆందోళన చెందుతున్నారు, నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది నిరాశను మిగల్చగా, ఈశాన్య రుతుపవనాలు అయినా వర్శిస్తాయని ఆశించిన రైతాంగానికి నిరాశ తప్పడం లేదు. దీని ప్రభావం రబీ పంటలపై పడుతుందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వేసవిలో భూగర్భజలాలు అడుగంటి తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.

శిథిలావస్థలో అంగన్వాడీ కేంద్రం


పైకప్పు పెచ్చులూడుతున్న నీలిగుంట అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని నీలిగుంట గ్రామపంచాయతీలోని అంగన్వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పిల్లలు, తల్లిదండ్రులు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు, పెచ్చులు ఊడి మీద పడడంతో గాయాలు పాలవుతున్నారని స్థానిక సర్పంచ్ వరహాలబాబు పలు సందర్భాలలో మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, కేంద్రంలో మరుగుదొడ్లు ం లేక అవస్థలు పడుతున్నారని తక్షణమే భవనాన్ని మంజూరు చేసి, నిర్మాణం చేపట్టాలని, అలాగే అంగన్వాడీ కేంద్రం నిర్వహణకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించాలని సిబ్బందితోపాటు స్థానికులు కోరుతున్నారు.

సాగు పట్టాలు మంజూరు చేసి ఆదుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు


సాగుదారులతో కలిసి భూములను పరిశీలిస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని దోసలపాడు అగ్రహారం,చీడిక రెవిన్యూలో నిరుపేద దళితులు, యాదవుల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం పేదల సాగులో ఉన్న భూములను సాగుదారులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన నిరుపేద దళితులు, యాదవుల గత30ఏళు ్లగాప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి ఆ భూముల్లో ఉన్న తుప్పలు, డొంకలు నరికి సాగు భూములుగా తయారుచేసి ,వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి జీడి, మామిడి తోటలు వేసుకుని వచ్చిన ఫల సాయంతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు .గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొంతమంది లబ్ధిదారులకు భూమి పట్టాలు ఇచ్చారన్నారు. పట్టాలు పొందని లబ్ధిదారులు అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా నేటికీ పేదలకు పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికే స్థానిక తహశీల్దార్‌కు పట్టాల కోసం పేదలు దరఖాస్తు చేశారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి సాగు భూములను సర్వే చేయించి, నిరుపేద సాగుదారులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని కోరారు . సాగుదారులకు పట్టాలు ఇవ్వకపోవడం వలన ప్రభుత్వం అందించే రైతు భరోసా, పీఎం కిసాన్, పంటరుణాలు, పంటలబీమా వంటి పథకాల లబ్ధి పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పేదల పరిస్థితి అర్థం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, సాగుదారులు పి.రమణ, ఎం.కల్యాణం, కె.ఎతిమాని, జీ.అప్పారావు, చిన్నారావు పాల్గొన్నారు.

వెంకటరమణకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏఎల్ పురం అంబేద్కర్ కాలనీలో బుధవారం సిపిఐ మాజీ ఎంపిపి, బొడ్డు వెంకటరమణ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థి, యువజన రంగంలో పనిచేసి స్నేహితులు, బంధువులతో స్నేహపూర్వకంగా ఉంటూ ప్రజానాట్యమండలి గాయకుడిగా, కమ్యూనిస్టుగా మంచి పేరు సంపాదించుకున్నారు. 2006లో గొలుగొండ మండల ఎంపిపిగా పని చేసి ఎస్సి,ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అందరికీ వెన్నుదన్నుగా సేవలందించారని కొనియాడారు. ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, మండల కార్యదర్శి మేకా భాస్కర్ రావు, పి.బాలరాజు, కె.రాంబాబు, కొయ్యూరు మండల సిపిఐ నాయకులు, మాజీ సర్పంచ్ కూడా కొండమ్మ, వియ్యపు నానాజీ, ఇరువాడ రాజు, చల్లా రాజు, ప్రజాసంఘాల నేతలు స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

ప్రజాశక్తి - చీడికాడ : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని ఎంపిపి కురచా జయమ్మ, జెడ్పిటిసి శారద వరలక్ష్మి జానకిరామ్ అన్నారు. బుధవారం మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో గడచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నేతృత్వంలో వైసిపి ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఇఒపిఆర్‌డి కామేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా, ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు జి.కొత్తపల్లి సచివాలయం పరిధిలో ఇప్పటివరకు రూ.30 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా అందజేశారని, దీనికి సంబంధించిన వివరాలను ఇఒపిఆర్‌డి చదివి వినిపించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి, నియోజకవర్గ పరిశీలకులు ఉరుకిట అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు రాజబాబు. గ్రామ పార్టీ అధ్యక్షులు కొల్లి శ్రీను, మండల సచివాలయం కన్వీనర్ చైతన్య, వైసిపి కార్యకర్తలు పుట్టా రామ్ కుమార్, మహాలక్ష్మి నాయుడు, కొల్లి వెంకటరావు, శ్రీను సచివాలయం, సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు


సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న నేతలు

దొండవాకలో చేతి బోరు ప్రారంభం

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని పెద్ద తీనార్ల పంచాయతీ దొండవాకలో మండల ప్రాదేశిక నిధులతో ఏర్పాటు చేసిన చేతిబోరును ఎంపిటిసి మెరుగు నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు .గ్రామంలో నెలకొన్న తాగినీటి ఎద్దడి దృష్టిలో పెట్టుకుని బోరు మంజూరు చేశామన్నారు.. గ్రామంలో చేతిబోరు ఏర్పాటుపై స్థానిక మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.


బోరును ప్రారంభిస్తున్న ఎంపిటిసి నాగేశ్వరరావు